సాక్షి
పల్నాడు
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023




దుర్గమ్మ సేవలో ఐఏఎస్

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను మహారాష్ట్ర ఉప లోకాయుక్త, ఐఏఎస్ సంజయ్ భాటియా దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవ స్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని పవిత్రోత్సవాలు ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు వేదపండితులు ఉదకశాంతి, ఆలయశుద్ధి, ప్రధాన, ఉపాలయాలమూర్తులకు అభిషేకాలు, అర్చనలు కలశారాధన, అగ్నిమథనం, హోమాలు, గోపూజ నిర్వహించారు. మంగళవారం రెండోరోజు మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ తెలిపారు.

చేబ్రోలులో 36.8 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 36.8 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 0.4 మి.మీ వర్షం పడింది. సగటున 6.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 34.8 మి.మీ., పొన్నూరు 13, పెదనందిపాడు 11.8, వట్టిచెరుకూరు 8.2, గుంటూరు పశ్చిమ 5.4, గుంటూరు తూర్పు 1.8, తాడికొండ మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా రవి



నరసరావుపేట: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ జి.శోభారాణి బదిలీపై సివిల్ సర్జన్‌గా రీజినల్ లేబొరేటరీ గుంటూరు మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు.

8వ తేదీన జాబ్ మేళా

గుంటూరు వెస్ట్: ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కాలేజీ, ప్రత్తిపాడులో మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 24 కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. విద్యార్హతను బట్టి జీతం రూ.8,000 నుంచి 40 వేల వరకు ఉంటుందన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.5,800 వరకు పలికింది.

దసరా సందడి షురూ..!

విజయవాడ: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఈ నెల 8వ తేదీన కో ఆర్డినేషన్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉత్సవాలకు ఏయే శాఖలు ఏయే ఏర్పాట్లు చేయాలనే అంశంతో పాటు ఆయా శాఖల మధ్య సమన్వయంపై చర్చిస్తారు. ఆయా శాఖల ముఖ్య అధికారులకు దుర్గగుడి దేవస్థాన అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. ఇక దసరా ఉత్సవాలకు అవసరమైన పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పనులు టెండర్ల దశకు చేరుకోగా, నాలుగైదు రోజుల్లో తుది దశకు చేరుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ప్రత్యేక పూజలు, సేవల వివరాలను దేవస్థానం రెండు రోజుల కిందట విడుదల చేసింది. అమ్మవారి ఆలయం పరిసరాలతోపాటు రాజగోపురాన్ని అందంగా ముస్తాబు చేసేందుకు అవసరమైన పెయింటింగ్ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజగోపురం వద్ద పెయింటింగ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో క్యూలైన్లు, షామియానాలు, వాటర్ ప్రూఫ్ షెడ్లు, వీఐపీల వాహనాల ఏర్పాటుకు రూ. 3.34 కోట్ల అంచనాలతో పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

గురుతారలు మెరిసే



- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు
- నరసరావుపేటలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం

అక్షరాలనే సప్త'వర్ణమాల'గా మార్చి జీవితాన ఇంద్రధనుస్సులు విరిసేలా చేసే ఆది దేవులు.. జ్ఞాన జ్యోతులతో నవ వసంతానికి నాంది పలికి భవితకు బంగారు బాట వేసే మార్గదర్శకులు.. అడుగులు తడబడినప్పుడు బడితె పట్టి.. గుణ'పాఠం' నేర్పే మాతృ సమానులు.. సన్మార్గం వైపు వెలుగుదివ్వెలై మెరిసే గురుతారలు.. మన మా'స్టార్లు'.. అందుకే మన పూర్వీకులు తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఇచ్చారు. గురుదేవో భవ అంటూ నినదించారు. మంగళవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ గురువులు సన్మానాలు అందుకోబోతున్నారు. జిల్లాస్థాయిలో సు'వర్ణమాల'లతో తళుకులీనబోతున్నారు.

బోధనా 'మాధురి'



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సెంటా(సెంటర్ ఫర్ టీచర్ అక్రిడేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పరీక్ష ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా పట్టణంలోని 23వ వార్డు ఎంపీపీఎస్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు జిగురు మాధురి ఎంపికయ్యారు. ఆమె తన ఉపాధ్యాయ ప్రస్థానంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఆమెను ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ-2 రాఘవేంద్రరావు అభినందించారు. మంగళవారం ఆమె నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకోనున్నారు.

ఉపాధ్యాయ శిఖరం ఏడుకొండలు



నరసరావుపేట రూరల్: పాలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బీహెచ్) ప్రధానోపాధ్యాయుడు మేడా ఏడుకొండలు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 5న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. 1986లో స్పెషల్ టీచర్‌గా ఎడ్వర్డ్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మేడా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికి 36 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఏడుకొండలు సెకండరీ గ్రేడ్ టీచర్‌గా, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా సేవలు అందించారు. గత ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన ఏడుకొండలను పలువురు అభినందించారు.

విద్యాసిరి'మువ్వా'



ముప్పాళ్ళ: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా దమ్మాలపాడు ఎంపీపీఎస్(రామాపురం కాలనీ) పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మువ్వా సురేష్ ఎంపికయ్యారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన నాటి నుంచి అంకితభావంతో పనిచేస్తున్నారు. బోధనలో మంచి గుర్తింపు సాధించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

'సాగి'ంది ఆంగ్ల జైత్రయాత్ర



మాచర్ల: మాచర్ల పట్టణం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాగి వెంకట శివ నాగరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1994 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన నాగరాజు జమ్మలమడకలో తొలి పోస్టింగ్ పొందారు. 2002 నుంచి 2019 వరకు వడ్డెరపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. 2019లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది తాళ్ళపల్లి, మండాది, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత, బాలురోన్నత పాఠశాలల్లో పనిచేసి ఆంగ్ల బోధనలో దిట్టగా గుర్తింపు పొందారు. ఇంగ్లిష్ మాధ్యమంలో 100 శాతం ఫలితాల సాధనకు విశేష కృషి చేశారు. సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేశారు. సొంత ఖర్చుతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారు. ఈ ఏడాది 10వ తరగతిలో ఇంగ్లిషు మాధ్యమంలో వందశాతం ఫలితాలు సాధించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం నరసరావుపేటలో కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా నాగరాజును పలువురు అభినందించారు.

అమరావతి అ'ద్వితీయం'





అమరావతి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. చావపాడు ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి మరియదాసు, అమరావతి రామకృష్ణ హిందూ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అనురాధ ఉత్తమ పురస్కారాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈఓలు శ్రీనివాసరావు. శివబాబు వారికి అభినందనలు తెలిపారు.

చదువు 'ప్రసాదు'ంచే



పెదకూరపాడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరేచర్ల వెంకట దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. వెంకట దుర్గాప్రసాద్ మండలంలోని కనిగండ్ల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన 2000లో డీఎస్సీ ద్వారా ఎంపికై సర్వీసులో చేరారు. అనంతరం కారంపూడి మండలం చినగార్లపాడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా తన సేవలందించారు. పెదకూరపాడులో కొంతకాలం పనిచేశారు. ఇప్పుడు కనిగండ్లలో చేస్తున్నారు. వెంకట దుర్గాప్రసాద్‌కు పురస్కారం రావడంపై ఎంఈఓ ఏకుల ప్రసాద్‌తోపాటు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పురస్కార'మేరి'కోరి..



పిడుగురాళ్ల: మాచవరం మండలం మల్లవోలు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న నారాయణ మేరి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 25 ఏళ్లుగా ఆమె ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. మాచవరం మండలంలో ఏడేళ్లుగా పని చేస్తున్నారు. మంగళవారం నర్సరావుపేటలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో అవార్డును స్వీకరించనున్నారు. మేరికి అవార్డు రావటంపై ఎంఈఓ రాజకుమారి, శ్రీధర్, కావాటి కోటేశ్వరరావు, కృష్ణ, రామిరెడ్డి, కె.రాంబాబు, జెల్డి విజయప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

అవార్డుతో 'షేక్'హ్యాండ్



చిలకలూరిపేట: పసుమర్రులోని శ్రీమద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ మొహమ్మద్ యాసిన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో మంగళవారం నిర్వహించే వేడుకల్లో కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు. ఇంగ్లిష్‌లో నూరుశాతం ఫలితాల సాధన కోసం కృషి చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇంగ్లిష్‌లో 91 శాతం మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికీ రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం



కలెక్టర్ శివశంకర్‌కు సమస్యను వివరిస్తున్న ప్రజలు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల అధికారులు చొరవ చూపించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అర్జీదారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులకు 168 వినతి పత్రాలు అందజేశారు. ఈ వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు అర్జీదారుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలను జిల్లా అధికారులు సత్కరించారు.

దివ్యాంగురాలికి తక్షణమే ఇంటిపట్టా మంజూరుకు ఆదేశం

నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వాసిమల్ల జ్యోతి తనకు ఇంటి స్థల పట్టా మంజూరు చేయాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్‌ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణమే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి
- నాడు-నేడుతో విద్య, వైద్య రంగాలు పటిష్టం
- గడప గడపలో గుర్తించిన పనులు పూర్తి కావాలి
- అవినీతికి అవకాశం ఉండరాదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు-నేడు పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలని సూచించారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న గొప్ప పనుల్లో నాడు-నేడు కార్యక్రమం ప్రముఖమైనదని పేర్కొన్నారు. దీనిద్వారా గ్రామాలు, పట్టణాల్లో అత్యాధునిక విద్య, వైద్య వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఇలా అన్ని నూతన భవనాల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయాలన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం ఎంతో కీలకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో కీలకమైనదని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలనూ వెంటనే పరిష్కరించడంలో అధికారులు మరింత చొరవ చూపాలని పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులకు ప్రభుత్వం వెనువెంటనే బిల్లులు కూడా మంజూరు చేస్తోందని వెల్లడించారు. పనులకు అనుమతులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. వెనువెంటనే అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించేలా చొరవ చూపాలన్నారు. నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 90 శాతం పూర్తయిందని చెప్పారు. అమృత్ పథకం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

అవినీతికి తావీయొద్దు

అధికారులు విధుల్లో గానీ, పనుల నిర్వహణల్లో గానీ అవినీతికి తావీయకుండా పని చేయాలని మంత్రి చెప్పారు. ఎక్కడైనా అవినీతి ఆరోపణలు వస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామాలు, వార్డుల్లో అభివృద్ధి పనులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్య తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి చెల్లింపులకు 'ఆధార్'

- జనవరి నుంచి అమలు
- సెప్టెంబర్ 1 నుంచే ప్రారంభించాలని భావించిన కేంద్రప్రభుత్వం
- కొన్నిచోట్ల ఆధార్ సీడింగ్ కాకపోవడంతో జనవరికి వాయిదా
- పల్నాడు జిల్లాలో 4,33,766 మంది వేతనదారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల నగదు చెల్లింపునకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను సెప్టెంబరు ఒకటి నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించినా ఈ ప్రక్రియ జనవరి ఒకటికి వాయిదా పడింది. ఆధార్‌కార్డు ద్వారా ఉపాధి కూలీలకు చెల్లింపులు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల అక్రమ చెల్లింపులను నియంత్రించొచ్చని భావించింది. ఇప్పటికే వేతనదారుల జాబ్ కార్డులను అధికారులు ఆధార్ కార్డులతో అనుసంధానం చేశారు. ఇంకా ఖాతాలకు అనుసంధానం జరుగుతోంది. మరో మూడు నెలలు గడువు పెంచడంతో అందరి ఖాతాలను అనుసంధానం చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 4,33,376 మంది వేతనదారులు ఉన్నారు. జిల్లాలో జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం వంద శాతం పూర్తయింది. బ్యాంకు ఖాతాలు 4,33,766 మందికి ఉండగా ఆధార్ అనుసంధానం 4,23,225 మందికి అంటే 97.6శాతం పూర్తయింది. ఇంకా 10,541 మంది ఖాతాలు అనుసంధానం కావాలి.

పారదర్శకత కోసమే



ఉపాధి హామీ పథకంలో ఆధార్ ఆధారిత చెల్లింపులకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జాబ్ కార్డుల ఆధార్ అనుసంధాన ప్రక్రియ పల్నాడు జిల్లాలో ముగిసింది. వేతనదారుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం 97.6 శాతం పూర్తయ్యింది. మిగిలిన ప్రక్రియ కూడా జరుగుతోంది. ప్రభుత్వం డిసెంబర్ ఆఖరు వరకు అవకాశం ఇచ్చింది. జనవరి ఒకటి నుంచి నూతన మార్గదర్శకాల ప్రకారం ఆధార్ ఆధారిత చెల్లింపులు జరగనున్నాయి.

– పి.వెంకటనారాయణ, ఇన్‌చార్జ్ ఏపీడీ, సత్తెనపల్లి

'రెవెన్యూ'లో విప్లవాత్మక మార్పులు

- రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- తహసీల్దార్ కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ప్రారంభం



పల్నాడు జిల్లా లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్ తదితరులు

సత్తెనపల్లి : రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లిలో సుమారు రూ.1.20 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ లోతేటి శివ శంకర్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు, రెవెన్యూ అధికారులతో కలిసి శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం భూముల రీ-సర్వే కార్యక్రమం చేపట్టిందని వివరించారు. దీనివల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని, సరైన ధ్రువ పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ భూములకు శాశ్వత పరిష్కారం చూపి, లబ్ధిదారులు అవసరమైతే అమ్ముకునేలా హక్కులు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో చుక్కల భూములకు కూడా పరిష్కారం లభించిందన్నారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అనేక సవరణలు తీసుకువచ్చిందన్నారు. 20 ఏళ్ల క్రితం అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, త్వరలో నియమ నిబంధనలతో చట్టం రూపొందించనున్నట్టు వెల్లడించారు. అనంతరం మంత్రితో కలిసి పల్నాడు జిల్లా లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబూన్‌బీ, జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, సహారా మౌలాలి, అచ్యుత శివప్రసాద్, తహసీల్దార్ ఎస్.సురేష్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

సెంటా అవార్డుకు ఎంపికైన హెచ్ఎం శకుంతల



కారెంపూడి: మండలంలో సెకండరీ గ్రేడ్ టీచర్ ఎ.శకుంతల సెంటా (సెంటర్ ఫర్ టీచర్స్ అక్రిడేషన్) అవార్డుకు ఎంపికయ్యారు. చింతపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా శకుంతల పని చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి రెండు అదనపు టీచర్ పోస్టులు మంజూరు కావడానికి కారకులయ్యారు. హెచ్ఎం విధులకే పరిమితం కాకుండా పిల్లలకు చక్కని విద్యాబోధన చేస్తున్నారు. నేడు గురుపూజోత్సవం సందర్భంగా నరసరావుపేటలో కలెక్టర్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. తనకు అవార్డు వస్తుందని ఊహించలేదని ఆమె పేర్కొన్నారు.

టీడీపీ వారికే మళ్లీ మళ్లీ కండువాలు కప్పి..

- తమ పార్టీవారికే కండువాలు కప్పి దేశంలో చేరిక అంటూ ప్రచారం
- టీడీపీ నేతల ప్రచారార్భాటం చూసి నవ్వుకుంటున్న ప్రజలు
- వైఎస్సార్ సీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు పెరగడంతోనే ఈ పాట్లు


గతంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు (వృత్తంలోని వ్యక్తి)

రాజుపాలెం: తెలుగుదేశం పార్టీలోని వారికే మళ్లీ మళ్లీ కండువాలు కప్పి ఆపార్టీ నాయకులు చేస్తున్న ఆర్భాటాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. టీడీపీలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారాలు చేసి మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారంటూ దుయ్యబడుతున్నారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు షేక్ గౌసియాబేగం నాగుల్ మీరా, బలిజేపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆలా అరుణకుమారి సుబ్బారావులను టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఆర్భాటంగా పార్టీలో చేర్చుకున్నారు. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్లితే ఆ ఇద్దరు మాజీ ఎంపీటీసీలు గత టీడీపీ ప్రభుత హయాంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు సమక్షంలో టీడీపీలో చేరారు. నాటి నుంచి అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. కాగా గత కొన్ని రోజులుగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు పెరగడంతో టీడీపీ నేతల్లో గుబులు మొదలైంది. ఎవ్వరు పార్టీలో చేరే వారు లేక తమ పార్టీలో వారికే కండువాలు కప్పి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. సోమవారం జరిగిన మాజీ ఎంపీటీసీ చేరిక విషయమై ప్రజలందరు ముక్కు మీద వేలేసుకుంటున్నారు. ఈ విషయమై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో టీడీపీ పూర్తిగా పట్టు కోల్పోయిందన్నారు. తమ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించేందుకు తమ పార్టీల వారినే తిరిగి చేర్చుకుని ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. మండలంలోని ప్రజలందరికీ వాస్తవం తెలుసని, టీడీపీ మోసపూరిత చర్యలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభూజీ

కుంకలమర్రు(కారంచేడు): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మొలబంటి ప్రభూజీ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నుంచి సమాచారం అందింది. సెంటా(సీఈఎస్‌టీఏ) ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం బోధనలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడంతో పాటు, ఉపాధ్యాయులు ఎలాంటి టీచింగ్ సామర్థ్యం కలిగి ఉన్నారని ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించింది. వీటి ఆధారంగా గణితం బోధనలో అవార్డు దక్కింది. జిల్లా వ్యాప్తంగా ఇంగ్లిష్, లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై సర్వే నిర్వహించారు. సబ్జెక్టులో ఒక్కొక్కరికి మాత్రమే ఈ అవార్డు ఇస్తున్నారు. విషయం తెలిసిన ఎంఈఓలు ఎంవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రభూజీని అభినందించారు. మంగళవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా నుంచి అవార్డు అందుకోనున్నారు.

ఉద్యోగం పేరిట టీడీపీ నాయకుడి మోసం

- జగనన్నకు చెబుదాంలో ఎస్పీకి ఫిర్యాదుచేసిన యూఎస్‌లో ఎం.ఎస్ చేసిన విద్యార్థి
- మొత్తం 30 ఫిర్యాదులు స్వీకరణ


సుంకర సాయి కోటేశ్వరరావు


జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి సమస్యలు చెబుతున్న బాధితుడు

నరసరావుపేట: దేవదాయశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద నుంచి టీడీపీ నాయకుడు కల్యాణం రాంబాబు రూ.16.70లక్షలు తీసుకొని మోసం చేశాడని నరసరావుపేట పట్టణం పెద్దచెరువుకు చెందిన సుంకర సాయికోటేశ్వరరావు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లాలోని నలు మూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు 30 అర్జీలను అందజేశారు. సుంకర సాయి కోటేశ్వరరావు ఫిర్యాదు చేస్తూ తాను అమెరికాలో ఎం.ఎస్ చేశానని, కరోనా సమయంలో ఇంటికి వచ్చి తిరిగి అమెరికా వెళ్లలేకపోయానన్నారు. ఖాళీగా ఉన్న తనను నమ్మించిన ఓ టీడీపీ నాయకుడు ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకున్నాడన్నారు. అతడిపై చీటింగ్ కేసు నమోదుచేసి తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించుకోవడానికి విచ్చేసిన ప్రజలకు నరసరావుపేట పట్టణానికి చెందిన శీలం జయరామిరెడ్డి, శీలం రామ సంజీవరెడ్డి తండ్రి శీలం కోటిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత అన్నదాన కార్యక్రమానికి సహాయం అందించారు. ప్రవల్లిక సత్యం, పాల్వాది మధుసూదన్‌రావు, చిన్ని వెంకట శ్రీనివాస్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి. రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, ఏ ఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ, దిశా డీఎస్పీ యు.రవి చంద్ర పాల్గొన్నారు.

వీసా ప్రాసెసింగ్ పేరుతో మోసం..

వీసా ప్రాసెసింగ్ పేరుతో రూ.4.38లక్షలు తీసుకొని ఆ పనిచేయకుండా ఓ వ్యక్తి మోసం చేశాడు. సుమారు ఏడాది క్రితం వీసా ప్రాసెసింగ్ చేయిస్తానని చెప్పిన ఒక వ్యక్తిని నమ్మి అతనికి డబ్బులు ఇచ్చాను. అతనిపై చర్యలు తీసుకుని, నాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– హరిప్రసాదురెడ్డి, బలిజేపల్లి గ్రామం, రాజుపాలెం మండలం

కాంట్రాక్టర్‌గా భాగస్వామ్యమిస్తే మోసం..

జిల్లాలోని నాగార్జునసాగర్ రైట్ బ్రాంచ్ కెనాల్ ప్యాకేజీలో సబ్ కాంట్రాక్టర్‌గా ఒక వ్యక్తిని భాగస్వామిగా చేర్చుకుని రూ.32 లక్షలు పెట్టుబడి పెట్టాను. వాటికి వడ్డీ వేసి డబ్బులు ఇస్తానని చెప్పి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి ఇబ్బంది పెడుతున్నాడు. అతనిపై చర్యలు తీసుకుని నా నగదు నాకు ఇప్పించగలరు.

– ఏకుల చినమల్లారెడ్డి, అడిగొప్పుల, దుర్గి మండలం

రూ.60లక్షలు అప్పు తీసుకొని, అడిగితే కొట్టి బెదిరిస్తున్నారు

సుమారు రెండేళ్ల క్రితం దుర్గి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు సుమారు రూ.60లక్షలు అప్పుగా ఇచ్చాను. ఆ డబ్బులను తిరిగివ్వమని అడుగుతున్నా సదరు వ్యక్తులు డబ్బులు ఇవ్వకుండా నన్ను తిట్టి, కొట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

–కుంచపు ఏడుకొండలు, నరసరావుపేట టౌన్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యభాగ్యం

- కలెక్టరేట్‌లో స్టాల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్, జేసీ
- అత్తలూరు ఆర్గానిక్స్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జైవిక్ అవార్డు
- ఢిల్లీలో స్వీకరించనున్న జిల్లా కలెక్టర్


ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను చూపిస్తున్న కలెక్టర్ శివశంకర్, ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అధికారులు, సామాన్య ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివారం ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పురుగుమందులు, రసాయన అవశేషాలు లేకుండా కేవలం ఆవు పేడ, ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలు ఉపయోగించి పండించిన ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, బియ్యం, కారం, పసుపు మొదలైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఈ విధానం అవలంబిస్తూ జిల్లాలోని అత్తలూరు గ్రామంలో అత్తలూరు ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నారన్నారు. వారికి కావలసిన ఘన జీవామృతం, కషాయాలు వంటి వాటిని అందిస్తూ పండించిన వ్యవసాయ ఉత్పత్తులను తిరిగి అత్తలూరు ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. వారే మార్కెటింగ్ అవుట్‌లెట్స్ ఓపెన్ చేసి వినియోగదారులకు వ్యవసాయ సహజ ఉత్పత్తులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. అత్తలూరు ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జైవిక్ జాతీయ అవార్డు-2023 రావటం పల్నాడు జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ అవార్డును ఈనెల 7వ తేదీన న్యూఢిల్లీలో జరిగే జాతీయ సమావేశంలో కలెక్టర్ అందుకోనున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి పేర్కొన్నారు.

వెనుకబడిన మండలాలపై సమీక్ష..

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలపై వెనుకబడి ఉన్న మండలాలను సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, 90 రోజుల పనిదినాల కల్పన, రీ-ఓపెన్ కేసులు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలు, ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రాథమిక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డెలివరీ శాతం పెంచడం, దానికి తగిన యాక్షన్ ప్లాన్ ద్వారా పురోగతిలోకి తీసుకురావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ సంఖ్య పెంచే విధంగా ఆయన పలు సూచనలు చేశారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా మెనూ ప్రకారం అమలు చేయాలని, విద్యార్థులు మరింతమందికి భోజన వసతి ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. నాడు-నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్న రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాలపై సమీక్షించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ద్వారా సచివాలయాల ఏర్పాటు పురోగతిలోకి తీసుకురావాలని మండల అధికారులను ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు 32,439 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 32,439 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,793 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,443 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్యా యత్నం

చీరాల: పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పలు చోరీ కేసుల్లో నిందితుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. ఈపురుపాలేనికి చెందిన ఇమ్మిడి వెంకటేశ్వర్లు, ఇటీవల వన్ టౌన్ పోలీసులు వైర్లు దొంగతనం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కోర్టు అతడికి కండిషన్‌తో బెయిలు మంజూరు చేసింది. ప్రతి సోమవారం పోలీసు స్టేషన్లో సంతకం చేయాల్సి ఉంది. సంతకం పెట్టేందుకు స్టేషన్‌కి వచ్చిన వెంకటేశ్వర్లును పోలీసులు విచారించారు. ఎనిమిది చోరీ కేసుల్లో నిందితుడి వేలిముద్రలు సరిపోలి ఉన్నాయి. దీంతో వెంకటేశ్వర్లు ఒక్కసారిగా బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. విషయం గమనించిన పోలీసులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు పరిస్థితి నిలకడగానే ఉంది. సీఐ మల్లికార్జున రావు మీడియాతో మాట్లాడుతూ చోరీ కేసులో కండిషన్ బెయిల్‌పై వచ్చిన నిందితుడిని మరి కొన్ని కేసుల్లో వేలిముద్రలు పోలి వుండటంపై విచారించినట్లు చెప్పారు. బెదిరించేందుకు తనతో తెచ్చుకున్న బ్లేడ్‌తో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడని తెలిపారు. నిందితుడికి ప్రాణా పాయం లేదని వైద్యులు తెలిపినట్లు చెప్పారు.

దూరవిద్య సప్లిమెంటరీ పరీక్ష ఫీజు వివరాలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఉత్తర్వుల మేరకు 2024 ఏప్రిల్‌లో జరగనున్న పదవ తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 5వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీవరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది పరీక్షకు హాజరై ఫెయిలైన అభ్యర్థులు, పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు అర్హులని తెలిపారు. పదవ తరగతిలో థియరీ ఒక సబ్జెక్ట్‌కు రూ.100, ఇంటర్మీడియెట్ థియరీ సబ్జెక్ట్‌కు రూ.150, ప్రాక్టికల్ ఒక సబ్జెక్ట్‌కు రూ.100 చెల్లించాలని తెలిపారు. అలాగే ఇంటర్మీడియెట్ ఇంప్రూవ్‌మెంట్ కోసం థియరీ ఒక సబ్జెక్ట్‌కు రూ.250, ప్రాక్టికల్ రూ.100 చెల్లించాలన్నారు. పరీక్ష ఫీజును ఏ.పి.టి ఆన్‌లైన్/పేమెంట్ గేట్ వే ద్వారా మాత్రమే చెల్లించాలనీ, డి.డి, చలానాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో ఏఐ కో-ఆర్డినేటర్స్‌గా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉప తనిఖీ అధికారులు తమ పరిధిలోని సప్లిమెంటరీ అభ్యర్థుల నుంచి ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డీఈఓ శామ్యూల్

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

నలుగురికి స్వల్పగాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొని బోల్తాపడిన సంఘటన మండలకేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుంచి వినుకొండ వైపునకు వెళుతున్న కారు ఫిరంగిపురంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ చల్లా కిషోర్ తన సిబ్బందితో కారులోపల వారిని బయటకు తీయించి, ప్రథమ చికిత్స చేయించి, పంపించివేశారు.

గుర్తుతెలియని బాలిక కంకణాలపల్లిలో ప్రత్యక్షం


తప్పిపోయిన బాలిక

సత్తెనపల్లి: గుర్తుతెలియని చిన్నారి కంకణాలపల్లిలో ప్రత్యక్షమైన సంఘటన సోమవారం జరిగింది. ఆ చిన్నారి తనపేరు భాను అని చెబుతుంది. ఈ చిన్నారి సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఒంటరిగా ఉండగా చుట్టుపక్కల వారు కంకణాలపల్లి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌కు చేర్చగా అంగన్‌వాడీ సెంటర్ కార్యకర్తలు తగు చర్యల నిమిత్తం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చిన్నారిని తీసుకు వచ్చారు. చిన్నారి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవలసినదిగా పోలీసులు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- బ్రేకులు ఫెయిలై ట్రాన్స్‌పోర్టు లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ప్రయాణికులంతా సురక్షితం


ట్రాన్స్‌పోర్ట్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. శ్రీశైలం నుంచి మునుగోడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉప్పలపాడు సమీపంలోకి రాగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పింది. అదే సమయంలో నరసరావుపేట నుంచి వినుకొండ వెళ్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీని బస్సు ఢీ కొట్టడంతో నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సుతో పాటు లారీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

గొడ్డలితో అన్నను గాయపరచిన తమ్ముడు

పెదకాకాని: ఆస్తుల వివాదంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి చేసిన సంఘటన సోమవారం నంబూరులో చోటు చేసుకుంది. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి వీరారెడ్డి, భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలోనూ, పోలీసుస్టేషన్‌లోనూ గతంలో మాట్లాడుకున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం అన్న వీరారెడ్డి తన ఇంటి వద్ద ఉండగా వేణుగోపాల్ రెడ్డి గొడ్డలి తీసుకుని అతనిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి భుజం వీపుపై గొడ్డలి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.